సాక్షి గుంటూరు

ఆదివారం । 20 । ఆగస్టు । 2023

I



వైభవంగా లక్ష్మీ పూజలు

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రిపై శనివారం శ్రీ లక్ష్మీపూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న జీయర్‌స్వామి అనుగ్రహ భాషణ చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2, 200, గరిష్ట ధర రూ.4, 400, మోడల్ ధర రూ.3, 400 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 520.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 859.80 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో రాహుకేతు పూజలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరాలయంలో శనివారం నుంచి రాహు కేతు గ్రహ పూజలు శనివారం ప్రారంభించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ మాట్లాడుతూ ప్రతిరోజు రాహుకాలంలో అభిషేకం, పూజలు చేయటానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

వెబ్‌సైట్‌లో బ్యాక్‌లాగ్ పోస్టుల ప్రొవిజనల్ లిస్ట్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ లిస్టును జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 54 ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్‌పోస్టులకు సంబంధించి మార్చి 25న నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా స్క్రూట్నీ ప్రక్రియ అనంతరం ప్రొవిజనల్ లిస్టును 19న https://www.gunturap.in/2023 వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. స్వీపర్, పబ్లిక్ హెల్త్ వర్కర్, గ్యాంగ్ మజ్దూర్, హోల్ టైమ్ సర్వెంట్, కళాసీ, డ్రెయిన్ క్లీనర్ పోస్టులకు సంబంధించిన రిట్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉంటుందన్నారు. మిగిలిన అన్ని పోస్టులకు సంబంధించిన వెబ్‌సైట్‌లో తెలిపిన షెడ్యూల్డ్ ప్రకారం భర్తీ ప్రక్రియ ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక వారి విద్యార్హతలతో సాధించిన ప్రతిభ ఆధారంగా జరుగుతుందని ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు.

ఇరువురు ఎంఈఓలకు అదనపు బాధ్యతలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు పశ్చిమ, పెదకాకాని మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓ-1) పోస్టుల్లో ఇరువురు ఎంఈఓలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు తూర్పు ఎంఈఓ-1గా ఉన్న వి.వెంకటేశ్వరరావును గుంటూరు పశ్చిమ-1, తాడికొండ ఎంఈఓ-1 టి.ఇందిరను పెదకాకాని ఎంఈఓ-1గా ఎఫ్ఏసీలుగా నియమించారు. సంబంధిత ఎంఈఓలు సెలవులో ఉన్న కారణంగా తాత్కాలిక ప్రాతిపదికన ఆయా పోస్టులను భర్తీ చేశారు.

మహా జాబ్‌మేళాకు పోటెత్తిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మహా జాబ్‌మేళాకు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాల వారీగా హాజరైన విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో రిజిస్ట్రేషన్ చేశారు. కళాశాల మెయిన్ బ్లాక్‌తో పాటు జేకేసీ, కెమిస్ట్రీ, హోం సైన్స్ బ్లాక్‌లలో కంపెనీల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, కళాశాల విద్య ఏజీఓ డాక్టర్ తులసి మస్తానమ్మ, ఉన్నారు. 225 మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధించారు.

ముగిసిన పంచాయతీ పోరు

- వైఎస్సార్ సీపీకి ఆధిక్యం
- 14 వార్డుల్లో విజయకేతనం



గొట్టిపాడులో పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో పంచాయతీలకు ఉపఎన్నికల ప్రక్రియ ముగిసింది. మొత్తం 27 వార్డులు, ఒక సర్పంచ్ పదవి కోసం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో 20 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన ఏడు వార్డులు, ఒక సర్పంచ్ పదవి కోసం శుక్రవారం ఉదయం నుంచి ఒంటిగంట వరకూ ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. సాయంత్రానికి ఫలితాలు విడుదల అయ్యాయి. మొత్తం 27 వార్డులకు గాను 14 వార్డుల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలుపొందగా, 11 వార్డుల్లో తెలుగుదేశం, రెండు వార్డుల్లో జనసేన సభ్యులు గెలుపొందారు. తెనాలి మండలం బుర్రిపాలెం సర్పంచ్ ఎన్నికల్లో తెలుగుదేశం గెలుపొందింది. తెనాలి సర్పంచ్‌గా పి. విజయలక్ష్మి గెలుపొందారు. చేబ్రోలు మండలం గుండవరం వార్డు సభ్యుడిగా జి. శివకుమార్, తోట్లపాలెం వార్డు మెంబర్‌గా కె. మీనా, తెనాలి హాఫ్‌పేట వార్డు మెంబర్‌గా వి శివానందం, పెదనందిపాడు మండలం అబ్బినేని గుంటపాలెం వార్డు మెంబర్‌గా ఎం.వేణుబాబు, రావిపాడు వార్డు మెంబర్‌గా ఎం.పావని, వరగాని వార్డు మెంబర్‌గా జి.వీరయ్యచౌదరి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు వార్డు మెంబర్‌గా జి.ఈశ్వర ప్రసాద్ గెలుపొందారు. జిల్లాలో 20 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. చేబ్రోలు మండలం శలపాడు 1వ వార్డుకు ఎం రాంబాబు, గుంటూరు రూరల్ చల్లావారిపాలెం 5వ వార్డుకు సీహెచ్ వెంకటరెడ్డి, ఓబులనాయుడుపాలెం 8వ వార్డుకు పి.విక్టోరియా, కాకుమాను మండలం భల్లూకనుడుపాలెం ఎనిమిదవ వార్డుకు జి.రవిచంద్ర, కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామం 5వ వార్డుకు కె.శివరామిరెడ్డి, మేడికొండూరు మండలం జగంగుట్లపాలెం 9వ వార్డుకు కె.లక్ష్మీ, ఫిరంగిపురం మండలం ఎర్రగుంట్లపాడు 9వ వార్డుకు ఎస్.సురేష్, పెదనందిపాడు మండలం వరగాని 4వ వార్డుకు జి.హేమంత్‌కుమార్, గోరిజవోలుగుంటపాలెం 8వ వార్డుకు టి. అన్నమ్మ, ప్రత్తిపాడు మండలం మేడవారిపాలెం రెండవ వార్డుకు కె. అనంద కుమార్, పాతమల్లయ్యపాలెం 10 వార్డుకు జి. భూషణం, నడింపాలెం10 వార్డుకు ఎస్‌కె. బాహి, నిమ్మగడ్డవారిపాలెం 4వ వార్డుకు జి. సతీష్, పొన్నూరు మండలం జడవల్లి 5వ వార్డుకు పి.జ్ఞాన సుందరి, దొప్పలపూడి 8వ వార్డుకు బి.మాణిక్యం, మాచవరం 1వ వార్డు యు.నాగేంద్రం, మునిపల్లె 2వ వార్డు జి. శ్రీవల్లి ప్రియదర్శిని, మునిపల్లె 8వ వార్డు ఎం సుస్మిత, తెనాలిమండలం నందివెలుగు 9వ వార్డు ఎస్.విజయలక్ష్మి, పెదరావూరు 2వ వార్డుకు జె.సమత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎవరైనా బయటకు వెళ్లాల్సిందే..!

- పోలింగ్ విధుల్లో ఉన్న సీఐ తీరుతో ఖంగుతిన్న ఎన్నికల అధికారులు
- లెక్కింపు సమయంలో కౌంటింగ్ కేంద్రం ఆవరణలోనే ఉండటానికి వీల్లేదంటూ అధికారులను బయటకు పంపి మెయిన్ గేట్ మూసివేత



గేట్లు మూసి వేయించడంతో బయట నిలబడి ఉన్న ఎన్నికల అధికారి ఎ.శ్రీరమ్య, ఇతర సిబ్బంది

ప్రత్తిపాడు: పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న ఓ సీఐ తీరుతో ఎన్నికల అధికారులు ఖంగుతిన్నారు. లెక్కింపు కేంద్రం కాదు కదా.. అసలు మీరు కౌటింగ్ సెంటర్ ఆవరణలోనే ఉండటానికి వీల్లేదంటూ.. అందరినీ బయటకు పంపి మెయిన్ గేట్ మూసి వేయించడం విమర్శలకు తావివ్వడంతో పాటు అధికారులను ముక్కున వేలువేసుకునేలా చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు మండలం గొట్టిపాడులో శనివారం వార్డుకు ఉప ఎన్నికలు జరిగాయి. పోలింగ్ కేంద్రం వద్ద నల్లపాడు సీఐ బత్తుల శ్రీనివాసరావుకు ఆశాఖ ఉన్నతాధికారులు విధులు కేటాయించారు. పోలింగ్ అనంతరం జరిగే కౌంటింగ్ ప్రక్రియకు అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ, ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య, జోనల్ ఆఫీసర్ సీహెచ్ రమాదేవి, రూట్ ఆఫీసర్ లీలారాణి, ఈఓపీఆర్డీ ఎం.మోషెలు కౌంటింగ్ కేంద్రం వద్ద ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఇంతలో సీఐ బత్తుల శ్రీనివాసరావు ఆదేశాలతో తొలుత ఓ మహిళా కానిస్టేబుల్ కౌంటింగ్ కేంద్రం వైపు నుంచి బయటకు వచ్చి ఆవరణలో ఉన్న వారంతా బయటకు వెళ్లిపోవాలంటూ చెప్పింది. తమను ఎందుకు వెళ్లమంటారులే.. అనుకుని అక్కడే నిలబడి ఉన్న ఎన్నికల అధికారుల వద్దకు వచ్చిన సీఐ ఇక్కడి నుంచి బయటకు వెళ్లిపోవాలని గట్టిగా చెప్పారు. మేము ఎన్నికల అధికారులమని, ఎన్నికల విధుల్లో ఉన్నామని చెబుతున్నా.. వినిపించుకోకుండా ఎవ్వరైనా వెళ్లిపోవలసిందే.. అంటూ గేటు బయటకు పంపించివేసి, మెయిన్ గేట్లు మూసివేయించారు. ఊహించని పరిణామంతో షాక్‌కు గురైన ఎంపీడీఓ సహా మిగిలిన అధికారులంతా బయటకు వెళ్లి గేటు బయట నిలబడ్డారు. అనంతరం కొద్దిసేపటి తరువాత ఏం జరిగిందో తెలియదు గానీ.. అధికారులను గేటు లోపలకు పిలిపించి, గేటు పక్కనే కుర్చీలు వేసి లోపల కూర్చోబెట్టారు.

సీఎం నిర్ణయం.. కాంట్రాక్టు ఉద్యోగులపాలిట వరం

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులు, నాయకులు

నెహ్రూనగర్: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల జీవితాల్లో వెలుగులు నింపిందని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని తు.చ.తప్పకుండా అమలు పరిచిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌న్ సరికొత్త చరిత్ర సృష్టించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూనె ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు యువజన విభాగం నాయకుడు ఆజం మాలిక్ ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎం చిత్రపటానికి కాంట్రాక్టు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ అడగందే అమ్మయినా అన్నం పెట్టదు అన్నది ఆర్యోక్తని, అయితే రాష్ట్రంలో ఎవరూ అడగకుండానే ప్రజల అవసరాలను స్వయంగా తానే తెలుసుకుని తీరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయబోమని, సుప్రీం కోర్టు తీర్పు అందుకు అనుమతించదని గతంలో చంద్రబాబు ప్రభుత్వం సాకులు చెప్పిన సంగతిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చకుండా సుప్రీంకోర్టు తీర్పు పేరుతో కాంట్రాక్టు ఉద్యోగులను మోసం చేసినట్లు మండిపడ్డారు. దానికి పూర్తి భిన్నంగా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు, న్యాయపరమైన, చట్టపరమైన చిక్కులను అధిగమించి, కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకుంటూనే క్రమబద్ధీకరణకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ఇంత మంచి మనసున్న వైఎస్ జగనే ఈ రాష్ట్రానికి మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్వయంగా ప్రజలే కోరుకుంటున్నట్లు నూనె ఉమామహేశ్వరరెడ్డి ప్రకటించారు. యువజన విభాగం నేతలు కోటి, రబ్బాని, ఆళ్ల కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, జన్నత్, సుధ, వంశీ, సాయి, బాలాజీ, జానీ, మాబు బాషా తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక హంగులతో రిటైరింగ్ గదులు

ప్రారంభించిన డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ



మాట్లాడుతున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రీ డెవలప్ మెంట్ కోసం రైల్వే శాఖ టూరిజం కార్పొరేషన్ రిటైరింగ్ గదులను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక గుంటూరు తూర్పు విభాగం రైల్వే స్టేషన్‌లోని మొదటి అంతస్తులో ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంత గదులను డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైరింగ్ గదులను ఐఆర్‌సీటీసీ స్వాధీనం చేసుకున్న తర్వాత అన్ని గదులు, డార్మిటరీలు పూర్తిగా ఎయిర్ కండీషనర్‌గా మార్చిందన్నారు. ఇది రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తుందన్నారు. ఈ గదులు టారిఫ్‌ను గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలోని హోటళ్ళతో పోల్చి సక్రమంగా నిర్ణయించామన్నారు. ఈ విశ్రాంత గదులు ప్రధానంగా రెండు సూపర్ డీలక్స్, 12 ఏసీ ఎగ్జిక్యూటివ్ గదులు, రిటైరింగ్ రూమ్‌లతో పాటు 11 డార్మిటరీ బెడ్ గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో 9 సింగిల్ బెడ్‌లు, 1 డబుల్ డార్మిటరీ బెడ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముదస్తుగా రిటైరింగ్ గదుల బుకింగ్‌లో పారదర్శకతను తీసుకురావడానికి, మొత్తం బుకింగ్ సిస్టమ్ ఐఆర్‌సీటీసీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లోకి తీసుకువచ్చామన్నారు. రైల్వే అధికారులు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకరబాబు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ టి.హెచ్.ప్రసాదరావు, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్, ఐఆర్‌సీటీసీ అధికారి కిషోర్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఐఆర్‌సీటీసీ వై.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోనే భవిష్యత్తుకు పునాది

గుంటూరు వెస్ట్: గ్రామాల్లోనూ, పేద కుటుంబాల్లో జన్మించిన చిన్నారులు ఉజ్వల భవిష్యత్తు పొందాలంటే వారు క్రమం తప్పకుండా పాఠశాలలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భావితరాల బంగారు భవిష్యత్తుకు విద్యాలయాలే కీలకమన్నారు. డ్రాపవుట్స్‌ను గుర్తించడంతోపాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థులంతా ప్రతి రోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యే విధంగా సిబ్బంది చూసుకోవాలని చెప్పారు. చిన్నారులకు విద్యాకానుక కింద కిట్స్, మధ్యాహ్నం రుచికరమైన, పౌష్టికాహారం ఉన్న భోజనాన్ని అందించాలన్నారు. సమావేశంలో డీఈఓ శైలజ, ఏపీ సమగ్ర శిక్ష జి.విజయలక్ష్మి, డిప్యూటీ డీసీఓలు వెంకటేశ్వరరావు, నిర్మలాదేవి పాల్గొన్నారు.

నేడు కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.42.75 కోట్లతో అధునాతన టెక్నాలజీతో బ్రిడ్జి నిర్మాణం
- నూతన బ్రిడ్జితో ట్రాఫిక్ సమస్యలకు చెక్



చేబ్రోలు సమీపంలోని కొమ్మమూరు చానల్

చేబ్రోలు: కృష్ణా డెల్టాలో రైతులకు సాగు నీరు అందజేసే ప్రధానమైన కొమ్మమూరు చానల్‌పై బ్రిటీషు కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీనిస్థానంలో ఆధునిక టెక్నాలజీతో రూ.42.75కోట్ల ఎన్‌డీబీ నిధులతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం తెలిపారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రిడ్జి నిర్మాణ ప్రాముఖ్యతను వివరించి నిధుల మంజూరుకు కృషి చేశారు. ఆదివారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఎంపీలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణారావు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్య వరప్రసాద్, కె.ఎస్.లక్ష్మణరావు, మర్రి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ తదితరులు హాజరవుతున్నారు.

రాకపోకలు ఇక సులువు..

గుంటూరు జిల్లా కేంద్రానికి సమీపంలో చేబ్రోలు పట్టణ పరిధిలో కొమ్మమూరు చానల్‌పై నిర్మించిన బ్రిడ్జి పొన్నూరు, గుంటూరు, బాపట్ల, రేపల్లె, చీరాల, ఒంగోలు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించటానికి ప్రదాన రహదారి మార్గం. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. కాలం చెల్లిన ఇరుకైన బ్రిడ్జిపై గతంలో పలుమార్లు కొంత భాగం కూలిపోయింది. దీనికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. మద్రాసు కాలువగా, పడవల కాలువగా పిలిచే కొమ్మమూరు కాలువ నూతన బ్రిడ్జి నిర్మాణంతో రాకపోకలకు సౌకర్య వంతంగా ఉంటుంది. రూ.42.75కోట్ల వ్యయంతో 40 అడుగుల వెడల్పు రోడ్డును 1.25 కి.మీ మేర నిర్మించే వంతెనతో ప్రమాదాల నివారణతో పాటు, ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంతో పాటు వాహనదారుల రాకపోకలకు అనుకూలంగా ఉంటుంది.

కాలువ ప్రాముఖ్యత ఇదీ..

కృష్ణా బ్యారేజి కంటే ముందే నిర్మించిన కొమ్మమూరు కాలువ 1877లో నిర్మాణం పూర్తి అయి పెద్ద గంజాం వద్ద బకింగ్ హామ్ కాలువలో కలుస్తుంది. విజయవాడ వద్ద కృష్ణా బ్యారేజీ నుంచి బయలు దేరిన పశ్చిమ ప్రధాన కాలువ 20కి.మీ దూరంలోని దుగ్గిరాల లాకుల వద్ద మూడుగా చీలుతుంది. వాటిలో ఒకటి కొమ్మమూరు కాలువ కాగా, రెండోది నిజాంపట్నం కాలువ, మూడోది పశ్చిమగట్టు కాలువ. దుగ్గిరాల లాకుల వద్ద మొదలైన కొమ్మమూరు కాలువ సంగం జాగర్లమూడి, చేబ్రోలు, కొల్లిమర్ల, నర్సాయపాలెం, కారంచేడు, సంతరావూరుల గుండా పెద్ద గంజాం చేరుతుంది. పెద్ద గంజాం వద్ద బకింగ్ హామ్ కాలువతో కలుస్తుంది. కొమ్మమూరు కాలువ నిర్మాణ సమయంలో సాగు 91,162 ఎకరాల ఆయకట్టుగా ఉండేది. కాలక్రమేణ ప్రస్తుతం 2.15లక్షల ఎకరాల ఆయకట్టుగా మారింది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 120, బ్యాంక్ కెనాల్‌కు 1408, తూర్పు కెనాల్‌కు 468, పశ్చిమ కెనాల్‌కు 107, నిజాంపట్నం కాలువకు 260, కొమ్మమూరు కాల్వకు 1983 క్యూసెక్కులు విడుదల చేశారు.

క్లుప్తంగా

గుంటూరు ఎస్ఈబీ సిబ్బందికి అదనపు బాధ్యతలు

నగరంపాలెం: గుంటూరు ఎస్ఈబీ (సెబ్)లో ప్రధానమైన రెండు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఉన్నతాధికారులకు తాత్కాలిక అదనపు చార్జ్ అప్పగించారు. గుంటూరు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఎస్.అన్నపూర్ణ విజయవాడకు, సహాయ సూపరింటెండెంట్ (ఏఎస్) కె.మణికంఠ నంద్యాలకు గత నెలాఖర్లో బదిలీయ్యారు. ఈ క్రమంలో గుంటూరు సూపరింటెండెంట్ చార్జ్‌ను పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఈబీ ఏఈఎస్ దుర్గ ప్రసాద్‌కు, ఏఎస్ ఛార్జ్‌ను సెబ్ స్టేషన్ గుంటూరు-1 సీఐ రమేష్‌కు అప్పగించారు.

22న తెలుగు భాషా దినోత్సవంపై పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 22న జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 8,9,10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు భాష మాధుర్యంపై వ్యాసరచన, వ్యవహారిక భాష అమలు కోసం గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన ఉద్యమంపై వక్తృత్వం, తెలుగు పద్యాల పోటీ, జానపద పోటీలు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలస్థాయిలో ప్రథమస్థానంలో గెలుపొందిన వారికి ఈనెల 23న మండల స్థాయిలో పోటీలను నిర్వహించి, ప్రతి మండలం నుంచి ఒకరిని ఈనెల 24న జిల్లాస్థాయిలో పోటీలను నిర్వహిస్తామని వివరించారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈనెల 26వ తేదీ సాయంత్రం 4.00 గంటలకు గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. ఆ కార్యక్రమంలో కవులు, తెలుగు భాషాభిమానులు, తెలుగు పండితులు పాల్గొనాలని కోరారు.

అంబులెన్స్‌కు దారివ్వని తెలుగు తమ్ముళ్లు!

- పేషెంట్‌ను తీసుకువెళ్లాలి.. దారివ్వమని డ్రైవర్ వేడుకున్నా కనికరించని వైనం
- ఎక్కడికి వెళ్తావు? నీ అంబులెన్సే దిక్కా? అంటూ వెటకారం!
- ఉండవల్లి అమరావతి కరకట్టపై ఘటన


నిలిచిపోయిన అంబులెన్స్

తాడేపల్లిరూరల్ : 'అర్జంటుగా రోగిని ఆస్పత్రికి తరలించాలి.. ప్లీజ్! దారి ఇవ్వమంటూ' ఓ అంబులెన్స్ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేసినప్పటికీ తెలుగు తమ్ముళ్లకు మనసు కరుగలేదు. పైగా 'ఎక్కడకి వెళ్తావు? నీ అంబులెన్సే దిక్కా' అంటూ వెటకారమాడి అంబులెన్స్‌ను అడ్డుకున్న సంఘటన శనివారం ఉండవల్లి అమరావతి కరకట్ట పై చోటుచేసుకుంది. తుళ్లూరు నుంచి విజయవాడ కేదారేశ్వర పేటకు వెళ్తున్న అంబులెన్స్ అమరావతి కరకట్ట మీదుగా ప్రకాశం బ్యారేజ్ వైపునకు ఉదయం 11.30 సమయంలో విచ్చేశాడు. ఆ సమయంలో టీడీపీ నేత చంద్రబాబు నాయుడు నివాసం వద్ద యువగళానికి వచ్చిన తెలుగుదేశం కార్యకర్తలు కరకట్ట మీద వాహనాలు నిలపడంతో అంబులెన్స్ డ్రైవర్ ఉండవల్లి డొంకలోంచి వెళ్లడానికి ప్రయత్నం చేశాడు. అప్పుడే గుంటూరు నుంచి బస్సుల్లో వచ్చిన టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చి అంబులెన్స్‌కు అడ్డంగా నిలబడ్డారు. అర్జెంట్‌గా పేషెంట్‌ను ఎక్కించుకుని వెళ్లాలి.. సైడ్ ఇవ్వమని డ్రైవర్ కార్యకర్తలను కోరగా వారు మూర్ఖంగా నీ అంబులెన్సే దిక్కా? ఇంక అంబులెన్సులు లేవా అంటూ అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదు. అరగంట పాటు అక్కడే ఉండి అనంతరం అంబులెన్స్ డ్రైవర్ అతి కష్టంమీద బయట పడ్డాడు. పక్కనే పార్కింగ్ చేసేందుకు స్థలం ఉన్నప్పటికీ లోకేష్ యువగళంలో ఎక్కువ మంది ప్రజలు వచ్చారని చెప్పేందుకు ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిపి వేసే విధంగా ముందస్తుగానే కార్యకర్తలను నాయకులు సూచనలు చేయడం వల్లే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

టీ-20 మ్యాచ్‌లో సత్తాచాటిన ప్రెసిడెంట్స్ జట్టు

36 పరుగుల తేడాతో సెక్రటరీస్ లెవెన్ జట్టుపై విజయం


మూడు వికెట్లు పడగొట్టిన శ్రీనవ్య

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నవులూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఏసీఏ అండర్-19 స్టేట్ ప్రాబబుల్స్ టీ-20 మ్యాచ్‌లో సెక్రటరీస్ లెవెన్ జట్టుపై ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 97 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ సీహెచ్ తమన్నా 26 బంతుల్లో ఒక ఫోర్‌తో 23 పరుగులు సాధించింది. సెక్రటరీస్ లెవెన్ బౌలర్లు కేవీ సాత్విక రెడ్డి మూడు ఓవర్లలో 20 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టగా మరో బౌలర్ పి.వనజాక్షి నాలుగు ఓవర్లలో 22 పరుగులిచ్చి రెండు వికెట్లను పడగొట్టింది. అనంతరం 98 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సెక్రటరీస్ లెవెన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 61 పరుగులు మాత్రమే చేసి 36 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బ్యాట్స్ ఉమెన్ పి.ఫౌజియా 41 బంతుల్లో ఒక ఫోర్‌తో 21 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు బౌలర్ ఎం.పర్ణిత యాదవ్ నాలుగు ఓవర్లలో 11 పరుగులిచ్చి రెండు వికెట్లను పడగొట్టింది.

మరో మ్యాచ్‌లోనూ...

కాగా ఏసీఏ అండర్-19 స్టేట్ ప్రాబబుల్స్ టీ-20 మ్యాచ్‌లో సెక్రటరీస్ లెవెన్ జట్టుపై ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెక్రటరీస్ లెవెన్ జట్టు 18.2 ఓవర్లలో 62 పరుగులకే కుప్పకూలింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ ఎస్.అర్షియ 50 బంతుల్లో ఒక ఫోర్‌తో 21 పరుగులు చేసింది. ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు బౌలర్ ఎస్‌జీ శ్రీనవ్య రెండు ఓవర్లలో నాలుగు పరుగులిచ్చి మూడు వికెట్లను పడగొట్టింది. అనంతరం 63 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ప్రెసిడెంట్స్ లెవెన్ జట్టు 15.3 ఓవర్లలో మూడు వికెట్లను కోల్పోయి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. సెక్రటరీస్ లెవెన్ జట్టు బౌలర్ ఎ విష్ణుప్రియ నాలుగు ఓవర్లలో అయిదు పరుగులిచ్చి ఒక వికెట్ పడగొట్టింది.

తాడేపల్లిలో ప్రగతి ప్రయోజన కార్యాలయం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సమాధి నరేష్‌కుమార్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి జాతీయ రహదారిలోని ఆర్‌కే రెసిడెన్సీలో రాష్ట్రీయ గ్రామీణ ప్రగతి ప్రయోజన కార్యాలయాన్ని శనివారం ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సమాధి నరేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామీణ ప్రగతి ప్రయోజన సంస్థకు అనుబంధంగా ఉన్న కన్య వివాహ యోజన ప్రాజెక్ట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ఉందని, ఇప్పుడు తాడేపల్లిలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. కన్య వివాహ యోజన పథకం ద్వారా 0 నుంచి 14 సంవత్సరాల లోపు బాలికలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ స్టేట్ కో ఆర్డినేటర్స్ నూతలపాటి ప్రవీణ్, బొడ్ల శ్రీను, నెలటూరి అనీల్ కుమార్, తెనాలి బ్రాంచ్ కో ఆర్డినేటర్, ఆర్‌జీపీపీ జిల్లా కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సంజీవదేవ్ భావజాలం విభిన్నం


పుస్తకాన్ని ఆవిష్కరించిన మహేంద్రదేవ్, పక్కన లలితానందప్రసాద్, దక్షిణామూర్తి, రాజగోపాల్

- ఎప్పటికీ గుర్తుండిపోతారు
- సుప్రసిద్ధ ఆర్థికవేత్త, ఎకనామిక్ అండ్ పొలిటికల్ జర్నల్ సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్

తుమ్మపూడి (తెనాలి): విభిన్న భావజాలంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కవి, రచయిత, చిత్రకారుడు, విమర్శకుడిగా గుర్తింపును పొందిన సంజీవదేవ్ తనను తెలిసిన, చదివిన అందరికీ ఎప్పటికీ గుర్తుండిపోతారని సుప్రసిద్ధ ఆర్థికవేత్త, ఎకనామిక్ అండ్ పొలిటికల్ జర్నల్ సంపాదకుడు ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్ అన్నారు. సంజీవదేవ్ స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం తుమ్మపూడిలోని ఆయన నివాసం 'రసరేఖ' ప్రాంగణంలో శనివారం సాయంత్రం సభకు ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ బి.లలితానంద ప్రసాద్ రచించిన 'ఎప్పటికీ అందరికీ సంజీవదేవ్' పుస్తకాన్ని మహేంద్రదేవ్ ఆవిష్కరించారు. పాఠశాల విద్య కూడా లేని సంజీవదేవ్ స్వయంకృషితో సాహితీవేత్తగా, చిత్రకారుడిగా, తత్వవేత్తగా ఎదిగారని గుర్తు చేసుకున్నారు. తాను నిత్యం ఆస్వాదించే ప్రకృతినీ, ప్రసిద్ధులైన వ్యక్తులను అక్షరబద్ధం చేశారని చెప్పారు. ప్రొఫెసర్ మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ, ఐహికం, పారమార్థానికి రెండింటికీ భిన్నంగా తనదైన వింతైన లోకంలో సంజీవదేవ్ చివరి వరకు విహరించారని చెప్పారు. 'చినుకు' పత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ పుస్తక సమీక్ష చేస్తూ సంజీవదేవ్ ఏదైతే చెప్పారో దానిని చివరి వరకు ఆచరించారని చెప్పారు. జీవితం కాంతివంతంగా ఉంటే మృత్యువు కూడా ఆనందంగా ఉంటుందని చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. సంజీవదేవ్ గురించిన సమగ్ర చిత్రణ పుస్తకరూపంలో రావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. చైతన్యవేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, తెలంగాణకు చెందిన జితేంద్రబాబు తమ ప్రసంగాల్లో, సంజీవదేవ్‌తో తనకు గల అనుబంధాన్ని వెల్లడించారు. సంజీవదేవ్ ఫౌండేషన్ వైవీ రావ్ స్వాగతం పలికిన సభలో రచయితలు డాక్టర్ సామల రమేష్‌బాబు, అనిల్‌డ్యానీ, రజా హుస్సేన్, జుగాష్‌విలి, మందరపు హైమావతి, డాక్టర్ రావెల సాంబశివరావు, దివికుమార్, చందు నాగేశ్వరరావు, పార్వతి పాల్గొన్నారు. రచయిత బి.లలితానందప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు.

కాంతమ్మా... ఇదేం పనమ్మా...!

జీజీహెచ్‌లో నకిలీ ఉద్యోగి పట్టివేత


కాంతమ్మను ప్రశ్నిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆర్థోపెడిక్ ఓపీలో రోగులకు డ్రస్సింగ్ చేస్తున్న నకిలీ ఉద్యోగి కాంతమ్మను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శనివారం ఆర్థోపెడిక్ ఓపీలో ఆయన తనిఖీ చేస్తున్న సమయంలో కాంతమ్మ నకిలీ ఉద్యోగిగా చలామణి అవుతున్నట్లు గుర్తించారు. ఇలాంటి నకిలీ ఉద్యోగుల వల్ల ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తుందని, నకిలీ ఉద్యోగులు రోగుల నుంచి డబ్బులు సైతం వసూలు చేస్తున్నారని వెల్లడించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగికి డ్రస్సింగ్ చేసేందుకు నకిలీ ఉద్యోగి డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు రోగి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

దళితులపై దాడులు అరికట్టాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): దళితులపై జరిగే దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులపై రోజురోజుకీ దాడులు, అత్యాచారాలు ఎక్కువయ్యాయని వాటిని అరికట్టాలన్నారు. మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బిళ్ల చెన్నయ్య మాట్లాడుతూ ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం బొట్లపాలెం గ్రామంలో ఆగస్టు 14న దళిత మహిళను వివస్త్రను చేసిన అగ్రవర్ణ కులస్తులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు అంటరాని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జి.చార్వాక, మాల ఐక్యవేదిక అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్ బాబు, వినుకొండ నియోజకవర్గం అధ్యక్షులు సుధాకర్, బడుగు సల్మాన్ పాల్గొన్నారు.





దేశాలు వేరైనా డ్యాన్స్ నీదేనయా!

వైరల్

● టాంజానియాలో కంటెంట్ క్రియేటర్ కలీపాల్ తన సోదరి నీల్‌పాల్‌తో కలిసి చేసిన డాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. రణ్‌వీర్ సింగ్, ఆలియా భట్ 'రాఖీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ' సినిమాలోని 'ఝుమ్కా' పాటకు కలీపాల్, నీమ్‌పాల్‌లు స్టెప్పులు వేశారు. తమ సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన ఈ డ్యాన్స్ వీడియో 1.4 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

● ఏ దేశమేగినా గానం నుంచి నృత్యం వరకు ఏదో ఒక రూపంలో దేశం మనతో ఉంటుంది. తాజాగా ఐకానిక్ వాషింగ్టన్ మాన్యుమెంట్ (యూఎస్) బ్యాక్‌గ్రౌండ్‌గా స్వాతి జయశంకర్ భరతనాట్యం చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో లక్షలాది వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'బ్యూటిఫుల్ బ్యాక్‌గ్రౌండ్ బ్యూటిఫుల్ డ్యాన్స్' అంటూ కామెంట్ సెక్షన్ ప్రశంసలతో నిండిపోయింది.

మణికేరళం

ఎక్కడి కేరళ? ఎక్కడి మణిపూర్? అయితే మానవత్వానికి భౌగోళిక సరిహద్దులతో పని లేదు అని నిరూపించే విషయం ఇది. కేరళ కోచిలోని ఆర్‌సీపీ రెస్టారెంట్‌లో మణిపూర్‌కు చెందిన సుస్మిత పనిచేస్తుంది. సర్వీస్ స్టాఫ్‌లో ఒకరైన సుస్మిత ఎప్పుడూ చురుగ్గా ఉంటుంది. మూడుసార్లు 'బెస్ట్ ఎంప్లాయీ'గా అవార్డ్ కూడా అందుకుంది. అలాంటిది... ఓ రోజున సుస్మిత డల్‌గా ఉండడం చూసి 'ఏమైంది?' అని అడిగాడు జనరల్ మేనేజర్.

తన రాష్ట్రం మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తల్లి, సోదరి గురించి ప్రస్తావిస్తూ 'వారికేమైనా అవుతుందేమో' అంటూ భయపడింది.

విషయం తెలిసిన చెఫ్ పిళ్లై, అతని టీమ్ మణిపూర్ నుంచి ఆమె తల్లి, సోదరిలను రప్పించి కోచిలో బస ఏర్పాటు చేశారు. సుస్మిత తల్లి ఇబెంచదేవి, సోదరి సర్ఫిదేవిలకు 'ఆర్‌సీపీ కోచి కిచెన్'లో ఉపాధి కల్పించారు. ఈ స్టోరీ ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయింది.



సార్... దిస్ అబ్బాయి బీట్ మీ... బట్ ఐయామ్ నాట్ తిరిగి బీట్!

అస్సాంలోని పచిమ్ నగామ్ గ్రామంలోని 'న్యూ లైఫ్ హైస్కూల్'లో పిల్లలు ఇంగ్లిష్‌లో మాత్రమే మాట్లాడాలనే నిబంధన ఉంది. ఒక రోజు ఇద్దరు పిల్లలు గొడవ పడ్డారు. క్లాస్ టీచర్ వారిని పిలిపించి 'టెల్ మీ, వాట్ హ్యాపెన్‌డ్?' అని అడిగారు. 'ఇతడు నా మెడ పట్టుకున్నాడు' అని ఒకరు చెప్పాలనుకున్నారు. 'ఇతడు నా తలపై పంచ్ ఇచ్చాడు' అని మరొకరు చెప్పాలనుకున్నారు. అట్టి విషయాన్ని పూర్తిగా ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో చెప్పలేక సైన్ లాంగ్వేజ్‌ను కూడా అప్పు తెచ్చుకొని కాస్తో కూస్తో ఇంగ్లిష్‌లో ఆ పిల్లలు చెబుతున్న మాటలు నెటిజనులను నవ్వుల్లో ముంచెత్తాయి.



పకోడీలు, బజ్జీలు తెలుసు.
కాని ఉల్లిపాయను తామరపువ్వులా ఒలిచి
శనగపిండిలో కలిపి నూనెలో వేయించి
ఉల్లి పుష్పంగా తయారు చేసి సర్వ్ చేస్తే
11 లక్షల వ్యూస్ లొట్టలేశాయి.
వదోదర స్ట్రీట్‌ఫుడ్‌లో తాజా హల్‌చల్ ఇది.

వేడి వేడి ఉల్లి పుష్పము



స్ట్రీట్‌ఫుడ్ ఎంత నోరూరించేదిగా ఉన్నా శుభ్రత పాటించరనే కంప్లయింట్‌తో కొందరు తినరు. కాని వడోదరలోని ఈ తాజా చిరుతిండి హల్‌చల్ చేయడమే కాక అందరి మన్ననా పొందింది. 'చేస్తే ఇంత శుభ్రంగా చేయాలి' అనే మెచ్చుకోలు అందుకుంది. వడోదర (గుజరాత్)లోని ఇద్దరు వ్యక్తులు ప్రత్యేకమైన స్టాల్ పెట్టి ఈ 'ఉల్లి పుష్పం' (ఉల్లి బజ్జీ) అమ్ముతున్నారు. ఇందుకు పెద్దసైజు ఉల్లిగడ్డలను వాడుతున్నారు. వాటిని పువ్వులా కట్ చేసే మిషన్‌ను తయారు చేయించుకున్నారు. శుభ్రంగా వొలిచిన ఉల్లిపాయను ఈ మిషన్ కింద పెడితే పువ్వులా రెక్కలు వచ్చేలా కట్ చేస్తుంది. దానిని శనగపిండిలో ముంచి వేడి వేడి నూనెలో వేయిస్తే ఉల్లిపువ్వు ఆకారంలో బజ్జీలు తయారవుతున్నాయి. ఇవి చూడటానికి ఆకర్షణీయంగా ఉండటంతో జనం ఎగబడుతున్నారు. అంతే కాదు చేస్తున్న పద్ధతి శుభ్రంగా ఉండటంతో సంకోచం లేకుండా తింటున్నారు. ఒక వ్లాగర్ ఈ ఉల్లిపువ్వు బజ్జీ తయారీని వీడియో తీసి ఇన్‌స్టాలో పెడితే క్షణాల్లో 11 లక్షల వ్యూస్ వచ్చాయి. 'కొత్త కొత్త ఆలోచనలే వ్యాపారాన్ని నిలబెడతాయి' అంటున్నారు. అందరి దగ్గరా ఉల్లిపాయలు ఉంటాయి. అందరూ బజ్జీలు వేస్తారు. కాని 'ఉల్లిపువ్వు బజ్జీ' అనే ఐడియా వీరికే వచ్చింది. ఆ 'ఎక్స్' ఫ్యాక్టర్ ఉన్నవాళ్లనే విజయం వరిస్తుంది. కొత్తగా ఆలోచించండి... పెద్ద విజయం సాధించండి... అని ఈ ఉల్లిపువ్వు కరకరలాడుతూ సందేశం ఇస్తోంది.

కనబడని చెయ్యేదో ఆడిస్తున్న ఆటబొమ్మలం... తోలుబొమ్మలం

'రంగ రంగ రంగస్థలానా... కనబడని చెయ్యేదో ఆడిస్తున్న ఆటబొమ్మలం అంటా...తోలు బొమ్మలం అంటా' అంటూ 'రంగస్థలం'లో తాత్వికంగా పాడతాడు రామ్‌చరణ్. ఈ పాట సంగతి ఎలా ఉన్నా 'బొమ్మలు మన కుటుంబ సభ్యులు' అంటున్నాడు ఆలిఫ్. కోల్‌కతాకు చెందిన వ్లోగర్ ఆలిఫ్ బొమ్మలు తయారుచేసే కార్మికుల వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

లిక్విడ్ ప్లాస్టిక్‌ను వివిధ రకాల బొమ్మల మూసలలో పోయడం నుంచి బొమ్మల తలలకు ప్లాస్టిక్ వెంట్రుకలు అతికించడం వరకు రకరకాల దశలు ఈ వీడియోలో కనిపిస్తాయి.



'లైఫ్ ఇన్ ప్లాస్టిక్ నాట్ ఫంటాస్టిక్' అంటూ ఒక యూజర్ స్పందించాడు.

'అందమైన బొమ్మల వెనుక ఇంత కష్టం ఉంటుందా!' అని చెప్పేలా ఉన్న ఈ వీడియో వైరల్ అయింది.

జయహే!



గ్రామీ అవార్డ్ విజేత రికీ కేజ్ లండన్‌లోని ప్రసిద్ధ అబేరోడ్ స్టూడియోస్‌లో మన జాతీయ గీతానికి సంబంధించి 100 మందితో లార్జెస్ట్ ఆర్కెస్ట్రాను నిర్వహించి రికార్డ్ సృష్టించాడు. ఈ వీడియోకు నెటిజనులు ఫిదా అవుతున్నారు. 'చారిత్రాత్మకమైన 100 పీస్ బ్రిటిష్ ఆర్కెస్ట్రాను నిర్వహించినందుకు మ్యూజిక్ కంపోజర్‌గా గర్విస్తున్నాను. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఈ వీడియోను ఎంతోమందికి షేర్ చేశాను. యూజ్ ఇట్, షేర్ ఇట్, వాచ్ ఇట్... బట్ విత్ రెస్పెక్ట్' అంటూ ట్విట్టర్‌లో రాశాడు రికీ కేజ్. 'వండర్‌ఫుల్' అంటూ ఈ వీడియోను రీషేర్ చేశారు ప్రధాని మోదీ.



75 కాదు 25!

సాధారణంగా 75 సంవత్సరాల వయసులో కొద్దిదూరం నడిచినా ఆయాసపడుతుంటారు. అస్సాంలోని దిబ్రూఘర్‌కు చెందిన 75 సంవత్సరాల హీర బోరా అలా కాదు. ఆరోగ్యకరమైన జీవనశైలి విషయంలో యువతను చైతన్యవంతం చేయడానికి త్రివర్ణ పతాకం చేతబూని పదికిలోమీటర్లు పాదయాత్ర చేసింది. ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. 'ఆమె వయసు 75 నుంచి 25కు వచ్చింది' అంటూ నెటిజనులు స్పందించారు.

హెల్త్



దేహంలోని రక్తనాళాలు కొన్ని చోట్ల బలహీనంగా ఉండవచ్చు. మెదడులో అలా జరిగినప్పుడు బలహీనమైన చోట రక్తనాళం ఉబ్బి... ఒక్కోసారి ఆ ఉబ్బిన రక్తనాళంలోని లోపలి పొర మీద ఒత్తిడి పెరిగిపోయి, అది మరింత పలచబారి అకస్మాత్తుగా చిట్లిపోవచ్చు. ఈ పరిణామం మెదడులో జరిగితే అక్కడ జరిగే రక్తస్రావంతో మరిన్ని దుష్పరిణామాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాంతకమూ కావచ్చు. ఇలా మెదడులోని రక్తనాళాల్లో బలహీనమైన చోట రక్తం పేరుకుని, అది బుడగలా మారడాన్ని 'అన్యురిజమ్స్' అంటారు. అప్పటివరకూ అంతా బాగున్నట్టే అనిపిస్తూ... అకస్మాత్తుగా ప్రమాదాన్ని తెచ్చిపెట్టే ఈ కండిషన్‌పై అవగాహన కోసం ఈ కథనం.

అన్యురిజమ్స్ నుంచి రక్షణ సాధ్యమే!

మెదడు చుట్టూరా ఆవరించుకుని ఉండే స్థలాన్ని సబర్కనాయిడ్ ప్రాంతంగా చెబుతారు. అన్యురిజమ్ కేసుల్లో దాదాపు 90 శాతం మందిలో ఆ ప్రాంతంలో రక్తస్రావం అవుతుంది కాబట్టి దాన్ని 'సబర్కనాయిడ్ హేమరేజ్' (ఎస్ఏహెచ్) అంటారు. రక్తనాళాలు చిట్లిన ప్రతి ఏడుగురిలోనూ నలుగురిలో ఏదో ఒకరకమైన వైకల్యం చోటు చేసుకునే అవకాశం ఉంది. రక్తస్రావం కాగానే పక్షవాతం (స్ట్రోక్), కోమాలోకి వెళ్లే అవకాశాలెక్కువ.

అన్యురిజమ్స్ ఉన్న చాలామందిలో మెదడులో రక్తనాళాలు బలహీనంగా ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు వారి జీవితకాలంలో అవి చిట్లకపోవచ్చు. కొందరిలో ఉబ్బు చాలా చిన్నగా ఉండవచ్చు. కానీ మరికొందరిలో ఇది ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని 'జెయింట్ అన్యురిజమ్స్' అంటారు. ఇలాంటివి అకస్మాత్తుగా చిట్లే అవకాశాలుంటాయి. దాంతో బాధితుల్లో అకస్మాత్తుగా పక్షవాతం కనిపించవచ్చు. హార్ట్ ఎటాక్స్‌లోలాగే 'సబర్కనాయిడ్ హ్యామరేజ్' అకస్మాత్తుగా సంభవిస్తుంది.

కారణాలు

● పొగాకు వాడకం, అనియంత్రితమైన రక్తపోటు, డయాబెటిస్ వంటివి ● రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్ కారణంగా కలిగే దుష్పరిణామాలు (కాంప్లికేషన్స్) ● చాలావరకు పుట్టుకతో వచ్చే (కంజెనిటల్), అలాగే జన్యుపరమైన కారణాలు. ఫ్యామిలీ హిస్టరీలో ఈ సమస్య ఉన్నప్పుడు ముప్పు ఎక్కువ ● క్రమబద్ధంగా / ఆరోగ్యకరంగా లేని జీవనశైలి ● ఏదైనా ప్రమాదం కారణంగా రక్తనాళాలు గాయపడటం. ● కొన్ని అరుదైన కేసుల్లో... ఫైబ్రోమస్క్యులార్ డిస్‌ప్లేసియా వంటి కండరాల జబ్బు, మూత్రపిండాల్లో నీటితిత్తుల్లా ఉండే పాలిసిస్టిక్ కిడ్నీ డిసీజ్... అన్యురిజమ్‌కు దారితీసే అంశాలు.

చిట్లినప్పుడు కనిపించే లక్షణాలు



● జీవితంలో ఎప్పుడూ రానంత అత్యంత బాధతో కూడిన తలనొప్పి
● స్పృహ కోల్పోవడం
● పక్షవాతం / ఫిట్స్ కూడా
● మాట్లాడలేకపోవడం, మూతి వంకరపోవడం

ముందే తెలిస్తే ముప్పు నివారణకు అవకాశం...

అన్యురిజమ్స్ ప్రాణాంతకమే అయినా ముందే తెలిస్తే బాధితుల్ని రక్షించుకునేందుకు అవకాశాలు పెరుగుతాయి. మెదడు సీటీ స్కాన్, మెదడు ఎమ్మారై పరీక్షల ద్వారా తలలోని రక్తనాళాలను పరిశీలించినప్పుడు ఈ సమస్య బయటపడే అవకాశం ఉంది. అందుకే ఫ్యామిలీ హిస్టరీలో ఈ ముప్పు ఉన్నవారు సీటీ, ఎమ్మారై పరీక్షలు చేయించడం ఒకరకంగా నివారణ చర్యలాంటిదే అనుకోవచ్చు. ఈ పరీక్షల్లో సెరిబ్రల్ అన్యురిజమ్స్ ఎక్కువగా ఉన్నట్లు తేలితే... గుండెకు చేసినట్టే మెదడుకూ యాంజియోగ్రామ్ చేస్తారు. 'సెరిబ్రల్ యాంజియో' అనే ఈ పరీక్షతో అన్యురిజమ్స్‌ను ముందుగానే నిర్ధారణ చేయడం ద్వారా ప్రాణాపాయ ప్రమాదాల్ని చాలావరకు నివారించవచ్చు.

గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లో పూడిక చేరడం వల్ల అడ్డంకులతో గుండెపోటు వస్తే... అప్పటికే అన్యురిజమ్స్‌కు గురైన రక్తనాళాలు చిట్లడం వల్ల సబర్కనాయిడ్ హ్యామరేజ్ వస్తుంది.

చికిత్సా ప్రత్యామ్నాయాలు

● శస్త్రచికిత్స కాకుండా మందులిస్తూ చేసే చికిత్స (నాన్ సర్జికల్ మెడికల్ థెరపీ) ● శస్త్రచికిత్స లేదా క్లిప్పింగ్ ● ఎండోవాస్క్యులార్ థెరపీ లేదా కాయిలింగ్ (అడ్జంక్టివ్ డివైస్ లేకుండా చేసే చికిత్స / వీలునుబట్టి డివైస్ వాడటం). వీటి గురించి వివరంగా...

మెడికల్ థెరపీ : రక్తనాళాలు చిట్లకముందు చేసే చికిత్స ఇది. రక్తపోటును అదుపులో ఉంచేందుకు మందులిస్తూ, కొని ఆహారాలు, వ్యాయామాలు సూచిస్తారు. అన్యురిజమ్స్ సైజు తెలుసుకోడానికి నిర్ణీత వ్యవధుల్లో తరచూ ఎమ్మారై / సీటీ స్కాన్/యాంజియోగ్రఫీ) చేయించడం అవసరం.

శస్త్రచికిత్స / క్లిప్పింగ్ : పుర్రె తెరవడం ద్వారా చేసే శస్త్రచికిత్స (క్రేనియాటమీ) ద్వారా ఉబ్బిన రక్తనాళాల్ని నేరుగా పరిశీలిస్తూ, పరిస్థితిని అంచనా వేస్తారు. అన్యురిజమ్‌లను గుర్తించి, శస్త్రచికిత్సతో వాటిని జాగ్రత్తగా వేరుచేస్తారు. ఉబ్బిన చోట క్లిప్పింగ్ జరిపాక మళ్లీ మునపటిలా రక్తప్రసరణ జరిగేలా జాగ్రత్త తీసుకుంటారు.

ఎండోవాస్క్యులార్ కాయిలింగ్ : తొడ ప్రాంతంలోని రక్తనాళం నుంచి ఒక పైప్ (క్యాథెటర్)ను ప్రవేశపెట్టి... అందులోంచి మరింత చిన్న పైప్‌లతో మెదడులోని అన్యురిజమ్స్‌కు చేరి, అక్కడ రక్తనాళాన్ని చుట్టలుచుట్టలుగా చుట్టుకుపోయేలా చేస్తారు. దాంతో ఉబ్బిన ప్రాంతానికి రక్తసరఫరా ఆగుతుంది. ఫలితంగా చిట్లడం నివారితమవుతుంది. ప్రస్తుతం ఉన్నవాటిల్లో దీన్ని మేలైన చికిత్సగా పరిగణిస్తున్నారు. ఇందులోనే బెలూన్ కాయిలింగ్ అనే ప్రక్రియలో అన్యురిజమ్ ఉన్న ప్రాంతానికి దగ్గర్లో బెలూన్ లాంటి దాన్ని ఉబ్బేలా చేసి, అటు తర్వాత కాయిలింగ్ చేస్తారు. ఇలా పెద్ద రక్తనాళాల దగ్గరున్న ఉబ్బును చిట్లకుండా రక్షిస్తారు. ఇవిగాక... దాదాపు ఏడేళ్ల నుంచి రక్తప్రవాహపు దిశ మళ్లించడానికి 'ఫ్లో డైవర్టర్ స్టెంట్స్' ఉపయోగిస్తున్నారు. వీటితో అన్యురిజమ్‌లోని రక్తపు దిశను మళ్లించి క్రమంగా ఉబ్బు తగ్గిపోయేలా చేస్తారు.

బాధితుల పరిస్థితిని బట్టి చికిత్సా ప్రత్యామ్నాయాలను డాక్టర్లు ఎంచుకుంటారు.



డాక్టర్ పవన్ కుమార్ పెళ్లూరు
కన్సల్టెంట్ న్యూరో సర్జన్

మీనియర్స్ డిసీజ్ అంటే..!

మన లోపలి చెవి (ఇన్నర్ ఇయర్) వినికిడి సామర్థ్యానికీ, నిటారుగా ఉండేందుకు దోహదం చేస్తుంది. ఇక్కడ సమస్య వస్తే వినికిడి శక్తి తగ్గడంతో పాటు, నిటారుగా నిలబడి ఉండే సామర్థ్యం కూడా తగ్గిపోయి ఒళ్లంతా గిర్రున తిరుగుతూ, తూలి కిందికి పడిపోతామేమోనన్న ఫీలింగ్ కలుగుతుంది. అంతేకాదు... ఏదో ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర నిలబడినప్పుడు వినిపించే హోరు లాంటిది చెవిలోంచి వినబడుతుంటుంది. ఇలా వినికిడి తగ్గడం, తూలి కిందపడిపోయేలా బ్యాలెన్స్ కోల్పోవడం, చెవిలోంచి హోరు వినిపించడం వంటి లక్షణాలతో వ్యక్తమయ్యే మీనియర్స్ డిసీజ్‌పై అవగాహన కోసం ఈ కథనం.

మీనియర్స్ డిసీజ్‌ను 'ఇడియోపథిక్ ఎండోలింఫాటిక్ హైడ్రాప్స్' అని కూడా అంటారు. అది ప్రాణాంతకం కాదుగానీ... చికిత్స అందరకపోతే క్రమంగా వినికిడి శక్తి కోల్పోయే అవకాశమూ ఉంది. గతంలో కాస్త అరుదుగా కనిపించే ఈ సమస్య... ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తుండటం వైద్యవర్గాల్లో ఆందోళనను కలిగిస్తోంది.

● **వర్టిగో లక్షణాలు :** పిల్లలు గిరగిరా తిరిగీ, తిరిగీ అకస్మాత్తుగా ఆగినప్పుడు బ్యాలెన్స్ కోల్పోయి తూలికింద పడిపోతామేమో అనిపించినట్లుగా లేదా రంగుల రాట్నంపై నుంచి విసిరివేసినట్లుగా అనుభూతి చెందుతూ ఆందోళన పడుతుంటారు. వర్టిగోలో కనిపించే ఇదే లక్షణం మీనియర్‌లోనూ కనిపిస్తుంది.

● **టినైటస్ లక్షణాలు :** ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరి గుయ్ అనే శబ్దమే కొందరికి చెవుల్లోంచి వినిపిస్తూ, చికాకు కలిగిస్తుంది. టినైటస్‌లోని ఇదే లక్షణం... మీనియర్స్ డిసీజ్‌లోనూ కనిపిస్తుంది.

● **వినికిడి తగ్గడం :** లక్షణాలను నిర్లక్ష్యం చేయడం, చికిత్స తీసుకోకపోవడం వల్ల శాశ్వతంగా వినికిడి కోల్పోయి... పర్మనెంట్ డెఫ్‌నెస్ వచ్చే అవకాశం ఉంది. వినికిడి లోపం అన్నది ఒక్కోసారి పెరుగుతూ ఒక్కోసారి తగ్గుతూ ఉంటుంది. కొన్నిసార్లు ఒకేరోజులోనే ఈ పెరగడం తగ్గడం జరుగుతూ ఉంటుంది. చెవి నిండిపోయినట్లుగా ఉండే ఫీలింగ్ చికాకు కలిగిస్తూ ఉంటుంది.

లక్షణాలు
మీనియర్స్ డిసీజ్‌లో వర్టిగో, టినైటస్, వినికిడిలోపం (డెఫ్‌నెస్) ఈ మూడు లక్షణాలూ కలగలసి ఉంటాయి.

● **నిర్ధారణ పరీక్షలు:** ● బాధితులు చెప్పే లక్షణాలతో ● ఆడియాలజిస్టుల ఆధ్వర్యంలో వినికిడి సామర్థ్యం పరీక్షలు (ఆడియోమెట్రీ టెస్ట్), వెస్టిబ్యులార్ టెస్ట్ బ్యాటరీ పరీక్షలతో పాటు డాక్టర్ల ఆధ్వర్యంలో మెదడు ఎమ్మారై, 'ఎలక్ట్రో కాక్లియోగ్రఫీ', 'ఎలక్ట్రో నిస్టాగ్మోగ్రఫీ' వంటి పరీక్షలు మీనియర్స్ డిసీజ్ నిర్ధారణకు తోడ్పడతాయి.



డాక్టర్ ఈ.సీ. వినయ కుమార్
సీనియర్ ఈఎన్‌టి సర్జన్

చికిత్స : ● వికారం, వాంతుల వంటి లక్షణాలను తగ్గించేందుకు యాంటీ-నాసియా (యాంటీ-ఎమిటిక్) మెడిసిన్స్ ఇస్తారు ● చెవిలోని ఒక రకం ద్రవం పెరగడం వల్ల మీనియర్స్ డిసీజ్ వచ్చే అవకాశం ఉన్నందున దేహంలోని ద్రవాలను బయటకు పంపించేందుకు మూత్రం ఎక్కువగా వచ్చే మందులైన 'డై-యూరెటిక్స్' అనే మందుల్ని వాడతారు ● వర్టిగోలో కనిపించే కళ్లు తిరగడం, పడిపోవడం లాంటి లక్షణాలను తగ్గించేందుకు 'వెస్టిబ్యులార్ రీ-హ్యాబిలిటేషన్' అని పిలిచే ఫిజియోథెరపీ లాంటి చికిత్సలను అందిస్తారు. ఇందులో బాధితులతో కొన్ని రకాల వ్యాయామాలు చేయిస్తారు ● వినికిడి సామర్థ్యం కోల్పోయిన వారిలో... వారు ఏ మేరకు కోల్పోయారో దాన్ని బట్టి హియరింగ్ ఎయిడ్ మెషిన్‌నూ అమర్చవచ్చు. ● పై చికిత్స లేవీ పనిచేయనప్పుడు చాలా అరుదుగా కొందరిలో శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు. ఇందులో 'ఎండోలింఫాటిక్ శాక్' అనే ప్రొసీజర్ ద్వారా చెవిలో అత్యధికంగా స్రవించే ద్రవాన్ని డ్రెయిన్ చేస్తారు ● ఈ మధ్య అందుబాటులోకి వచ్చిన 'ఇంట్రాటింపానిక్ స్టెరాయిడ్ ఇంజెక్షన్స్' థెరపీ కూడా ఉపయోగపడుతుంది.

● **ఇతర పరీక్షలు:** మెదడులో గడ్డలు, కొన్ని రకాల మెదడు సమస్యలు ఉన్నప్పుడూ ఈ లక్షణాలే కనిపిస్తాయి కాబట్టి... 'మీనియర్స్ ప్రోటోకాల్' కూడా చేసి... సమస్య మెదడుకు సంబంధించింది కాదని రూల్ అవుట్ చేసుకుంటారు.

● **నివారణ / వ్యాధి ఉన్నవారికి చెప్పే జాగ్రత్తలు :** ● మీనియర్స్ డిసీజ్ ఉన్నవారిలో కొన్ని రకాల ఆహార నియంత్రణలను సూచిస్తారు. ఇవి కొంతమేరకు నివారణకూ తోడ్పడతాయి ● ఆహారంలో ఉప్పు తగ్గించడం ● చాక్లెట్లు, కెఫీన్ ఎక్కువగా ఉండే కాఫీ, కోలాడ్రింక్స్ వంటి పానీయాలను పరిమితంగా తీసుకోవడం ● ఆల్కహాల్, పొగ అలవాట్లకు దూరంగా ఉండటం ● చైనా సాల్ట్‌కు దూరంగా ఉండటం.



మెడిటిప్: పెద్దపేగు క్యాన్సర్ నివారణకు...

మారిన ఆహారపు అలవాట్లతో గతంలో పాశ్చాత్య దేశాల్లోనే కనిపించిన పెద్దపేగు క్యాన్సర్ ఇప్పుడు మన దేశంలోనూ ఎక్కువగా కనిపిస్తోంది. చిన్న చిన్న జాగ్రత్తలతోనే దీన్ని నివారించవచ్చు. అవి... ● కొవ్వులు తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటూ... తాజా ఆకుకూరలను, పండ్లను అందులో భాగం చేయాలి ● మాంసాహారాన్ని పరిమితంగా తీసుకోవడంతో పాటు అందులో కొవ్వు మోతాదులు తక్కువగా ఉండే చికెన్, చేపల వంటి వైట్ మీట్‌ను మాత్రమే తీసుకోవాలి. వేటమాంసం, రెడ్‌మీట్ నుంచి దూరంగా ఉండాలి ● తేలిగ్గా విరేచనమయ్యేందుకు ఆహారంలో పీచు ఎక్కువగా ఉండే చిరుధాన్యాలూ, కాయధాన్యాలకు ప్రాధాన్యమివ్వాలి ● మంచి ఆరోగ్యకరమైన విసర్జక అలవాట్లు కలిగి ఉండాలి. అంటే రోజూ ఒకేవేళకు మల విసర్జనకు వెళ్లడం, అజీర్తి, గ్యాస్ ట్రబుల్ లేకుండా చూసుకోవడం లాంటివి. మలవిసర్జన సాఫీగా జరగాలంటే దేహానికి మంచి కదలికలూ, తగినంత వ్యాయామం ఉండాలి ● పొగ, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి. ఈ సూచనలు కేవలం పెద్దపేగు (కోలన్) క్యాన్సర్‌ను మాత్రమేగాక అనేక ఇతర క్యాన్సర్లలతోపాటు మరెన్నో జబ్బులనూ నివారిస్తాయి.